



# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గురువారం 20 నవంబర్ 2025 | పేజీలు : 04


# అంబరాన్నంటుతున్న సత్యసాయి జన్మదిన సంబరాలు

## ప్రముఖుల రాకతో జనసంద్రంగా మారిన పుట్టపర్తి రహదారులు




సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న ప్రధాని నరేంద్ర మోడీ, ప్రధాని మోడీని ఆశీర్వచనం చేస్తున్న పండితులు.

**పుట్టపర్తి రూరల్ నవంబర్ 19 ప్రభాతవార్త:**

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో శ్రీ సత్య సాయి శతవర్ష జన్మదిన వేడుకలు అంబరాన్ని అంటుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్య అతిథిగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఉదయం 9: 50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోపాటు కేంద్ర,రాష్ట్ర మంత్రులు కిషన్ రెడ్డి, కింజరపు రామ్మోహన్ నాయుడు, సత్య కుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, అనగానిసత్యప్రసాద్, సవితమ్మ, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి స్వాగతం పలికారు. తొలిత ప్రధానమంత్రి సీఎం డిప్యూటీ సీఎంలతో కలిసి శ్రీసత్యసాయి మహాసమాధిని దర్శించుకుని, కుల్వంత్ మందిరంలోని సత్యసాయి కాంచ విగ్రహం వద్ద ధ్యానముద్రలో కూర్చుని బాబా ఆశీస్సులు పొందారు. అనంతరం పండితులు ప్రధానిని వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. సత్య సాయి ట్రస్టు ద్వారా నిరుపేద రైతులకు అందిస్తున్న గోదాన లబ్ధిదారులకు గోవులను దానం చేశారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సత్యసాయి ముద్రణ కలిగిన 100 రూపాయల నాణ్యాన్ని, స్టాంపును, మరియు సత్యసాయి ట్రస్టు ద్వారా బాలికలకు అందిస్తున్న సమృద్ధి పథకాన్ని పిల్లలకు అందించి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ట్రస్ట్ జిల్లాలోని 20వేలమంది ఆడపిల్లలకు ఆర్థికభరోసా కల్పించనుంది. ఈకార్యక్రమంలో క్రికెటర్‌సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ పాల్గొన్నారు. ప్రముఖ మ్యూజిక్ డ్రం ప్లేయర్ శివమణి ప్రత్యేక వాయిద్య ప్రదర్శనను , ప్రఖ్యాత గాయని సుధా రఘునాథన్ గీతాలను ఆలపించారు. వీరితోపాటు సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, జాతీయ అధ్యక్షుడు నిమిష్పాండే పాల్గొన్నారు. అనంతరం మహా మంగళ హారతితో వేడుకలు ముగిసాయి. సభాస్థలంనుంచి 12:50 నిమిషాలకు ప్రధాని మోడీ ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయం నుండి బయలుదేరి వెళ్లాడు. ఈ వేడుకలలో దాదాపు లక్షఇరవై వేల మంది సాయి భక్తుల పాల్గొనడంతో హిల్వ్యూ స్టేడియం జనసంద్రంగా మారింది. వేడుకలకు విచ్చేసిన భక్తులకు సెంట్రల్ ట్రస్ట్ పట్టణం నలుమూలల అన్నదాన ప్రసాదాన్ని ఏర్పాటు చేసింది. పోలీసులు ప్రధాని పర్యటన దృష్ట్యా ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. తిరిగి సాయంత్రం సాయి కుల్వంత్ సభా మండపంలో పద్మభూషణ్ అవార్డు గ్రహీత గాయని సుధా రఘునాథన్ బృందం అద్భుతమైన సంగీత కచేరిని నిర్వహించారు. ఈ ప్రదర్శనను మహిళా దినోత్సవం విదేశీ మహిళలు సైతం సంగీత గీతాలను ఆలపించడం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

# నాస్తికులను సైతం ఆధ్యాత్మికత వైపు నడిపిన సమ్మోహన శక్తి సత్యసాయి

**- బాబా బోధనలు కోట్లాది మందిని ప్రభావితం చేశాయి - 140 దేశాల్లో సేవలు అద్వితీయం**

**- మరింత నిబద్ధతతో పని చేసే శక్తిని ప్రసాదించాలని ప్రార్థించా - ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**




సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



ప్రధాన మంత్రి నరేంద్రమోడికి కదిరి లక్ష్మినరసింహ స్వామి ప్రతిమను జ్ఞాపికగా బహూకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**శ్రీసత్యసాయి జిల్లా, నవంబర్ 19, ప్రభాతవార్త ప్రతినిధి:**

నాస్తికులను సైతం ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపించిన సత్యసాయి సమ్మోహన శక్తి ప్రపంచంలో అరుదైనదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బుధవారం హిల్ వ్యూ స్టేడియంలో భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి పర్యటనను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి బాబా మన కాలంలో ప్రత్యక్ష దైవ స్వరూపంగా ప్రజలకు ప్రేమ, సేవ, శాంతి, సౌభాగ్యం మార్గాన్ని చూపించిన మహానుభావుడని కొనియాడారు. "అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు" (లవ్ ఆల్ సర్వ్ ఆల్), అందరికీ సహాయం అందించు...ఎవ్వరినీ బాధించకు (హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్) అనే బాబా మహావాక్యాలు ఈ ప్రపంచానికి విశ్వ శాంతి, సర్వజన సుఖాయ అనే ఆయన సంకల్పాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. ఈ పుణ్యభూమి పుట్టపర్తిలో నేడు జరుగుతున్న భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా ప్రకటించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నామన్నారు.బాబా నమ్మింది ఒకటే - మానవ సేవే మాధవ సేవ. అదే ఆయన జీవితం, అదే ఆయన సందేశమని పేర్కొన్నారు. ప్రేమే ఏకైక మతం, హృదయమే ఏకైక భాష, మానవత్వమే ఏకైక కులం, విధి ఒకటే చట్టమని, సర్వవ్యాపకమైన దైవం ఒకటేనని బాబా చెప్పిన మాటలు ప్రపంచం నలుమూలలా కోట్లాది మందిని ప్రభావితం చేశాయన్నారు. వందలాది దేశాల నుంచి వచ్చిన భక్తులందరికీ ఆయన దివ్య అనుగ్రహం లభించిందని, పేద నుండి అగ్ర కులాల దాకా, సామాన్యుల నుండి ప్రపంచ నాయకుల దాకా అందరి బాధలు వినడం, పరిష్కార మార్గం చూపడం ఆయన ధర్మమైందన్నారు. సత్యసాయి సంస్థల ద్వారా అందుతున్న సేవలు ప్రపంచంలో ఏ సంస్థలతో పోల్చిన ప్రత్యేకమై, విశిష్టమై అద్వితీయంగా ఉంటాయన్నారు. 102 విద్యాసంస్థల ద్వారా 60,000 మంది విద్యార్థులకు ఉచిత, విలువల ఆధారిత విద్య, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, 2 జనరల్ హాస్పిటల్స్, 2 మొబైల్ హాస్పిటల్స్ ద్వారా రోజుకు 3,000 మందికి పైగా రోగులకు ఉచిత వైద్యం త్రాగునీటి కోసం 550 కోట్లు ఖర్చుచేసి ఏపీ, తెలంగాణ, తమిళనాడులో 1600 గ్రామాలకు నీటి సరఫరా చేయడం ద్వారా 30 లక్షల మందికి ప్రయోజనంచేకూరుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 140 దేశాల్లో 2000 కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నారని, 7.5 లక్షల సత్యసాయి సేవాదళ్ సభ్యులు చెన్నై డ్రింకింగ్ వాటర్ మోడరనైజేషన్ స్కీంకు 250 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారన్నారు.బాబా ప్రజాసేవలో చూపిన వేగం, ఆయన సంకల్ప శక్తి, ఆయన కరుణామూర్తి స్వభావం ప్రపంచానికి ఆదర్శమని కొనియాడారు. పేదల కోసం, నీటి కోసం, ఆరోగ్య కోసం, విద్య కోసం చేసిన సేవలకు ఎటువంటి సాటిలేదని, ఈ శతజయంతి సందర్భంలో కేంద్ర ప్రభుత్వం భగవాన్ సత్యసాయి బాబాకు గౌరవార్ధంగా ప్రత్యేక రు.100 నాణెం మరియు పోస్టల్ స్టాంపులను విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇందుకు గాను హృదయపూర్వక ధన్యవాదాలు తెలిజేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ మహోత్సవానికి స్వయంగా హాజరై ఆశీస్సులు పొందడం, బాబాతో ఆయనకు ఉన్న ఆత్మీయ బంధాన్ని వెల్లడిస్తున్నదన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడికి, తనకు భగవాన్ సత్యసాయి బాబా ఆశీస్సులతో మరింత నిబద్ధతతో పని చేసే శక్తిని ప్రసాదించాలని ప్రార్థించానన్నారు. మనందరం కలిసి బాబా బోధించిన ప్రేమ, సేవ, ధర్మం, శాంతి సిద్ధాంతాలను మరింత విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్, ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండుల్కర్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సూప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ,శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య, ఐటి, పారిశ్రామిక శాఖ మంత్రి నారాలోకేష్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డి, , ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర రెవిన్యూ శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, చీఫ్ సెక్రటరీ విజయానంద్, ఎంపీ బికేపార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, బండారు శ్రావణి, దగ్గుపాటి ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, స్వచ్ఛందకార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్, సినీ నటుడు మురళీమోహన్, సత్యసాయి యూనివర్శిటీ ఛాన్సలర్ చక్రవర్తి, ట్రస్ట్ సభ్యులు నాగనంద, నిమిష్ పాండ్య, జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పి సతీష్ కుమార్, కేరళ సంగీత విధ్వాంసులు హరిహరన్, పద్మశ్రీ అవార్డు గ్రహిత శివమణి, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు, వేలాది మంది సాయి భక్తులు పాల్గొన్నారు.

# ఎందరినో ప్రభావితం చేసిన ఆధ్యాత్మికవేత్త సత్యసాయి

**- నేటి జల జీవన్ మిషన్ కు ఆనాడే అంకురార్పణ జరిగింది**

**- హాలీవుడ్ నటుడు బాబాను దర్శించుకోవడం ఆశ్చర్యకరం**

**- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**




సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**పుట్టపర్తి టౌన్, నవంబర్ 19, ప్రభాతవార్త**

ప్రపంచంలో ఎందరినో ప్రభావితం చేసిన ఆధ్యాత్మికవేత్త భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా సత్య సాయి హిల్వ్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా ప్రసంగాలు విని వాటి ద్వారా ప్రభావితమై ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది సాయి చూపిన బాటలో నడుస్తున్నారన్నారు. అత్యంత వెనుకబడిన జిల్లాలో పుట్టిన సత్యసాయిబాబా ఆధ్యాత్మిక తేజస్సుతో, విశ్వ ప్రేమతో ప్రపంచాన్ని ఆకర్షించారన్నారు. ఈ ప్రాంతంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు బాబా కృషి చేసి తాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేసి ఈ ప్రాంత దాహార్తిని తీర్చారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన జల్జీవన్ మిషన్ తరహాలో ఆనాడే వాటర్ ప్రాజెక్టులకు అంకురార్పణ జరిగిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఒక హాలీవుడ్ నటుడు సత్యసాయి బాబాను ను దర్శించుకునేందుకు ఇక్కడికి రావడం నన్ను ఎంతో ఆశ్చర్యపరిచిందన్నారు. అంతకుమునుపు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దేశ ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ మండపంలో గల సత్యసాయి బాబా మహా సమాధిని దర్శించుకున్నారు.

# బాబా చూపిన మార్గంలో మనమంతా నడుద్దాం

**- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విద్య వైద్య సేవలు - రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్**

**పుట్టపర్తి టౌన్, నవంబర్ 19, ప్రభాతవార్త**

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా చూపిన మార్గంలో మనమంతా నడుద్దామని రాష్ట్ర విద్యా, ఐటి, ఎలక్ట్రానిక్ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం పుట్టపర్తిలో సత్య సాయి హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల్లో ప్రేమ ఉన్నంతవరకు భగవాన్ శ్రీ సత్య సాయి బాబా మన మధ్యలోనే ఉంటారన్నారు. బాబా చెప్పినట్లు సేవే కులం, మానవత్వమే మతం ఆయన చూపించిన బాటలో మనమంతా నడవాలని అన్నారు. నా జీవితం నా సందేశం అని ఆయన జీవితాన్ని మనకు పాఠంగా నేర్పారన్నారు. ఒక మారుమూల గ్రామంలో పుట్టి నేడు ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మికత సేవకు ప్రతిరూపంగా పుట్టపర్తి విరాజల్లుతోందన్నారు. బాబా జీవితం కండ ఖండాంతరాలకు వ్యాపించి వయసుతో సంబంధం లేకుండా లక్షలాది మందికి ప్రేరణగా నిలుస్తోందన్నారు. బాబా బోధించిన ప్రేమ, స్వార్థరహిత సేవ ప్రతి మనిషిక అలవర్చుకోవాలన్నారు. సత్యసాయి బాబా నెలకొల్పిన వైద్యశాలల్లో ప్రపంచ ప్రమాణాలతో వైద్య సేవలు అందిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లక్షలాది మందికి కీలకమైన శస్త్ర చికిత్సలు చేస్తూ పునర్జన్మను ప్రసాదిస్తోందన్నారు. సత్యసాయి విద్యాసంస్థల్లో విలువలతో కూడిన విద్యను అందించటం ద్వారా యువ హృదయాల్లో జీవిత లక్ష్యాన్ని సహకారం చేస్తుందన్నారు. విద్యార్థుల్లో సమాజం పట్ల బాధ్యత విలువను పెంపొందించే అభ్యాసన సంస్థలుగా సేవలందిస్తోందఅన్నారు. సురక్షిత తాగునీటి ప్రాజెక్టులు పట్టణాలు, గ్రామాలు, మారుమూల గిరిజన ప్రాంతాలకు అనుసంధానించి ప్రజారోగ్యాన్ని సంరక్షిస్తూ వాస్తవ ప్రగతిని సాధిస్తుందన్నారు. నేటి యువత సాంకేతికత, కరుణ, సానుభూతి కలయికతో కూడిన లక్షణాలు కలిగి ఉండాలన్నారు. ఇదే భగవాన్ సత్యసాయి బాబా యువతకు ఇచ్చిన సందేశం అన్నారు. పేదలకు ప్రేమతో సహాయం అందించాలని సాయి చెప్పినట్లుగా పిల్లలకు చిన్నప్పటి నుంచే నైతిక విలువలు నేర్పాలన్నారు, సత్య సాయి బాబా ప్రేమతో ప్రపంచాన్ని గెలిచి, సేవతో ప్రజలకు బాబా దేవుడయ్యారన్నారు. కుల,మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి ప్రేమతో సేవ చేయాలని ఇదే మనం బాబాకు ఇచ్చే నిజమైన నివాళు అన్నారు.కేంద్ర ప్రభుత్వం సత్యసాయిబాబా పేరు మీద ప్రత్యేకంగా నూరు రూపాయలు నాణ్యాన్ని, పోస్టల్ స్టాంప్ ను విడుదల చేస్తున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఏపీ ప్రజలు, సత్యసాయి భక్తుల తరఫున నారా లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.




మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

# బాబా వాగ్దానం ప్రధాని పునీత దర్శనంతో నిజమైంది

**- బాబా మార్గాన్ని భావితరాలకు అందించడమే ట్రస్ట్ లక్ష్యం - శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్**

**పుట్టపర్తి, నవంబర్ 19, ప్రభాతవార్త**

భక్తులతో భగవాన్ సత్యసాయి మాట్లాడుతూ, దీవెనలు అందించడానికి వస్తుంటానని చెప్పేవారని, ఆ వాగ్దానం నేడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడి పునీత దర్శనంతో నిజమైందని శ్రీసత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. బుధవారం భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి విచ్చేసిన సందర్భంగా హిల్వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఆర్.జె.రత్నాకర్ మాట్లాడుతూ, సాయి భక్తులు, సేవాదళ్ సభ్యులకు, ప్రపంచం నలుమూల నుండి విచ్చేసిన వేలాది మంది భక్తులకు ప్రేమపూర్వక అభినందనలు తెలియజేశారు. పుట్టపర్తి భగవాన్ సత్యసాయి బాబా జన్మభూమి మాత్రమే కాదు, ఆయన కర్మభూమి కూడా అన్నారు. ప్రపంచానికి ప్రేమ, శాంతి, సేవ అనే మానవతా విలువలను ఇక్కడి నుంచే ప్రసారం చేశారన్నారు.సత్యసాయి విద్యాసంస్థల్లో చదివిన వేలాది మంది విద్యార్థులు నేడు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవ చేస్తున్నారని గర్వంగా తెలిపారు. ఆ విద్యార్థుల్లో చాలామంది ఈ శతజయంతి కార్యక్రమాలకు ప్రత్యేకంగా విచ్చేసి సేవలో పాల్గొనడం బాబా బోధనల మహాత్యం అన్నారు. సత్యసాయి ప్రసంగాలను ఊటంకిస్తూ, "మా అమ్మ చదవలేదు.. నన్ను కూడా చదవించలేదు. కానీ ఆమె ఇచ్చిన విలువలు, దీవెనలు నన్ను నడిపిస్తున్నాయి" అని బాబా చెప్పేవారిని గుర్తు చేసుకున్నారు. దేశంలోని తల్లులు తమ పిల్లలకు జ్ఞానం, విలువలు అందించాలని బాబా ఎల్లప్పుడూ ఉద్బోధించేవారన్నారు. భగవాన్ బోధించిన ప్రేమ, సేవ, ధర్మం, అహింస మార్గాన్ని భవిష్యత్ తరాలకు మరింత విస్తరించడం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ యొక్క ప్రధాన ధ్యేయమన్నారు. భగవాన్ సత్యసాయి బాబా పేరున రూ.100ల నాణెం, పోస్టల్ స్టాంప్‌లు విడుదల చేయడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోడి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే సత్యసాయి శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంపూర్ణ సహకారం అందించడం పట్ల కృతజ్ఞతా భివందనాలు తెలియజేసుకుంటున్నానన్నారు. భక్తుల సహకారంతో ప్రపంచమంతటా సత్యసాయి సేవలను మరింత బలంగా ముందుకు తీసుకెళ్తామని రత్నాకర్ వివరించారు. భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు విచ్చేసిన ప్రముఖులు, అశేష సత్యసాయి భక్తకోటికి పేరుపేరున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానన్నారు.



భగవాన్ సత్యసాయి బాబా రూ.100ల నాణెంను విడుదల చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోడి, సిఎం చంద్రబాబు నాయుడు, ఆర్.జె.రత్నాకర్‌లు దృశ్యం

# బాబా ఆశీస్సులు ఎప్పుడూ మనతో ఉన్నాయి మనల్ని నడిపిస్తున్నాయి

## భారత రత్న, క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్

**శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము) నవంబర్ 19 ప్రభాతవార్త:**

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవంలో పాల్గొన్న భారత రత్న సచిన్ టెండూల్కర్ బాబా పట్ల తనకున్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని, దివ్యానుభూతులను ఎంతో హృదయపూర్వకంగా పంచుకున్నారు. ఆయన సందేశం భక్తులను కదిలించేలా, బాబా మహిమను ప్రతీ హృదయంలో మళ్లీ ముద్రించేలాగా నిలిచింది.సత్యసాయి బాబాకు నా ప్రణామాలు. ఆయన నాకు చిన్నతనం నుంచే ఒక దైవసంబంధం లాంటి అనుభూతిని ఇచ్చారని తన బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ చెప్పారు.నాకు ఐదేళ్ల వయసులో ఉండగా ఎక్కడికైనా వెళ్లినా ఈ బాలుడు బాల సత్యసాయి బాబాలా ఉన్నాడు అని అందరూ చెప్పేవారు. ఆ మాటలు అప్పట్లో వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా, తరువాత బాబాతో ఏర్పడిన అనుబంధం ఆ మాటలకు అర్థం చూపింది.1990లలో వైట్‌ఫీల్డ్‌లో భగవాన్ సత్యసాయి బాబా దర్శనం పొందిన సందర్భాన్ని సచిన్ ప్రత్యేకంగా గుర్తుచేసుకుంటూ మనం అడగకపోయినా మన మనసులో ఏముందో, ఏ సందేహం వుందో బాబా ముందుగానే చెప్పేవారు. ఇది నమ్మశక్యం కాకపోయినా.. నేను అనుభవించిన సత్యం అన్నారు.శారీరక, మానసిక ఆరోగ్యంపై బాబా ఇచ్చిన బోధనలు తన జీవితాన్ని ప్రభావితం చేశాయని తెలిపారు.2011 వరల్డ్ కప్‌కు సంబంధించిన తమ జీవితంలో మరచిపోలేని ఘట్టాన్ని ఆయన పంచుకున్నారు. ఆ వరల్డ్ కప్ సమయంలో అపారమైన అంచనాలు, ఒత్తిడి ఉండేవి. బెంగళూరులో మా క్యాంప్ జరుగుతున్నప్పుడు బాబా ఫోన్ చేసి, ఒక పుస్తకం పంపించానని చెప్పారు. ఆ పుస్తకం నాలో అనూహ్యమైన విశ్వాసాన్ని రగల్చిందని సచిన్ అత్యంత భావోద్వేగంతో గుర్తుచేశారు. 2011లో ముంబైలో ఇండియా-శ్రీలంక మధ్య జరిగిన ఫైనల్‌లో భారత జట్టు గెలిచి ట్రోఫీ అందుకున్నప్పుడు అది నా జీవితంలో గోల్డెన్ మూమెంట్ అనుభవం చెప్పింది ఇది బాబా ఆశీస్సుల వల్లే సాధ్యమైంది. ఆ విజయంతో బాబా తనకు అంతర్గత శక్తి, ధైర్యం, ఆత్మవిశ్వాసం ప్రసాదించారని తెలిపారు.బాబా మన వెంట ఉంటే భయం అనే మాటనే ఉండదు. ఆయనను స్మరించడం ఒక ఆశీర్వాదం.ఈ శతజయంతి వేడుకల్లో పాల్గొనడం తనకు ఒక గొప్ప సత్కారం, అదృష్టం, ఆధ్యాత్మిక అనుభూతి అని "బాబా ఆశీస్సులు ఎప్పుడూ మనతో ఉన్నాయి మమ్మల్ని నడిపిస్తున్నాయి." అని సచిన్ తెలిపారు.




సత్యసాయిబాబాని స్మరించుకుంటూ ప్రజలకు సందేశాన్నిస్తున్న సచిన్ టెండూల్కర్

# శిల్పారామంలో సాంస్కృతిక సంబరాలు

**శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము)నవంబర్ 19 ప్రభాతవార్త:**

శ్రీసత్య సాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా జిల్లాకలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 23వరకు వివిధకళా సంస్థల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. రెండురోజులనుండి వివిధకళాసంస్థల ఆధ్వర్యంలో ప్రదర్శనలు జరిగాయి. మూడవరోజు బుధవారం సాయంత్రం అనంతపురం నకు చెందిన శ్రీ నిత్య కళానిలయం శ్రీమతి సంధ్యా మూర్తి కళా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సాంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చంద్రహాసిని ,ప్రణవ , బబిత, నిఖిత, వేదన్విత, దీక్షిత, హర్షవర్ధ తదితర చిన్నారుల బృందంచేసిన కూచిపూడి భరతనాట్యం శివపాదం ,అన్నమయ్య కీర్తనలు ,తరిగొండ, వెంగమాంబ కీర్తన,థిల్లన తదితర నృత్య నాట్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా పర్యాటకశాఖ అధికారి నరసయ్య మాట్లాడుతూ భావితరాలు మనసంస్కృతిసాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనాదిగా వస్తున్న సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. శ్రీ సత్య సాయి బాబా శతజయంతి వేడుకల నిర్వహణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రధాన భూమిక పోషించిందని దేశ విదేశాల నుంచి వస్తున్న సాయి భక్త జనులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డి ఎ డిపిఎం రామ్మోహన్, నృత్య కళాకారులు, శిల్పారామం ఏవో ఖాదర్ వలీ, సాయి భక్త జనులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




తమ నృత్యంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న చిన్నారులు



నృత్య ప్రదర్శనను వీక్షించడానికి వచ్చిన ప్రజలు

02ATP27_02ATP27.qxd 19-11-2025 PM 10:36 Page 1



## గ్రామాల యందు పరిశుభ్రతపై శిక్షణా కార్యక్రమం



శిక్షణా తరగతుల దృశ్యం

బ్రహ్మ సముద్రం నవంబర్ 19 ప్రభాతవార్త

మండల కేంద్రం నందు మండల ప్రజా పరిషత్ కార్యాలయ్నుల నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో లోకల్ సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ లో ఒకటైన పరిశుభ్రత మరియు పచ్చనైన గ్రామం"అను విషయంపై రెండవరోజు మండలంలోని స్వయం సహాయక బృందాల మహిళలకు మరియు గ్రామసమాఖ్యలీడర్లకు శిక్షణకార్యక్రమాన్ని నిర్వహించ డం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామంలోని పరిశుభ్రత విషయంలో తడి చెత్త, పొడి చెత్త విషయంపై, మురికి నీటి విషయంపై మరియు బహిరంగ మలవిసర్జనపై మహిళలందరికి అవగాహన కల్పించడం జరిగింది. ఈశిక్షణ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి యం.ఉమాదేవి , శిక్షణ టి ఓ టి పంచాయతీ అభివృద్ధి అధికారి యోగేష్, మండల సమైక్య లీడర్ యాదవ సుకన్య కార్యాలయ సిబ్బంది, స్వయం సహాయ బృందాల మహిళలు మరియు గ్రామ సమైక్య లీడర్లు పాల్గొనడం జరిగింది.

## నెల రోజులకే పాడైన పోలేపల్లి రోడ్డు

**నాసిరకం రోడ్డు వేశారని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోలు**

**నిద్ర వ్యవస్థలో పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్**

**ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండల వ్యాప్తంగా మొదటి రోడ్డే నాసిరకం**

బ్రహ్మసముద్రం నవంబర్ 19 ప్రభాతవార్త



నెల రోజులకే డ్యామేజ్ అయిన పోలేపల్లి రోడ్డు దృశ్యం

మండలంలోని వేపులపర్తి నుండి పోలేపల్లి వరకు ఒక కోటి 30 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం చేపట్టి నెల గడవకముందే తారు రోడ్డు ఒకపక్క పాడైపోవడంపై ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి పిఐయు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో వేసిన తారు రోడ్డు నాసిరకంగా వేశారంటూ ప్రజలు విమర్శలతో పాటు సోషల్ మీడియాలో ఫోటోలు వైరల్ అవుతుంది రోడ్డును సరిగా రోలింగ్ చేయకుండా నాసిరకం రోడ్డును సరిగా రోలింగ్ చేయకుండా తారు రోడ్డు వేయడంపై ప్రజల నుండి విమర్శలు వస్తున్నాయి చర్యలు తీసుకోవాల్సిన అధికారులే చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం నాసిరకం రోడ్డుపై పంచాయతీరాజ్ డిఇ నాగేంద్ర కుమార్ ను వివరణ కోరగా క్వాలిటీ కంట్రోలర్ చెక్ చేశారు ఏదైనా డ్యామేజ్ ఉంటే సదరు కాంట్రాక్టర్ తో చేయిస్తానని తెలియజేశారు. కాంట్రాక్టర్ ఎలాంటి రోడ్డు వేసిన అధికారులకు పట్టదా ప్రజల బాగోగుల కోసం వేసిన తారు రోడ్డు మూడు నాళ్ళ ముచ్చటగా తయారైన తమకు అందాల్సింది అందితే పట్టించుకోరా అన్న విమర్శలు ప్రజల నుండి బలంగా వినిపిస్తున్నాయి ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులకు చలనం వచ్చి నాసిరకం రోడ్లను వేయకుండా చర్యలు తీసుకుంటారా వేచి చూడాలి.

## బీటీపీ కాలువ పనులను పరిశీలించిన హంద్రీనీవా సుజల స్రవంతి ఎస్ఈ స్వరూప్



కాలువ పనులు పరిశీలిస్తున్న ఎస్-ఈ స్వరూప్

కళ్యాణదుర్గం రూరల్ నవంబర్ 19 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం ప్రాంత ప్రజల జీవనాడి, ఈ ప్రాంత రైతుల చిరకాల వాంచ బీటీపీ ప్రాజెక్టు పనులను హంద్రీనీవా సుజల స్రవంతి సూపరింటెండెంట్ ఇంజనీర్ స్వరూప్ బుధవారం పరిశీలించారు బోరంపల్లి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ ఒంటిమిద్ది వద్ద జరుగుతున్న కాలువ పనులను దేవినేని అవినాష్ తో కలిసి ఎస్సీ పరిశీలించారు కాలువ పనులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు చొరవతో చాలా చురుగ్గా, శరవేగంగా జరుగుతున్నాయని మరింత వేగంగా జరిగేందుకు కొత్త వాహనాలు కూడా వచ్చాయని ఎస్ ఇ స్వరూప్ కు అవినాష్ వివరించారు.. వీలైనంత తొందరగా పనులను పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు

## పాలిటెక్నిక్ కళాశాల స్కిల్ హబ్ కేంద్రంలో వృత్తి విద్యా కోర్సులలో ఉచిత శిక్షణ

### ఇంటర్, ఆపై విద్యావంతులు అర్హులు.

కళ్యాణదుర్గం,నవంబర్ 19 ప్రభాతవార్త



పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ తిప్పేస్వామి

కళ్యాణదుర్గం మండల పరిధిలోని బోరంపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ హబ్ కేంద్రంలో వృత్తి విద్యా కోర్సులలో మూడు నెలల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ తిప్పేస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ కోర్సులలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ నం : 9177444351 కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## యానిమేటర్లకు అవగాహన శిక్షణ సమావేశం

బెలుగుప్ప, నవంబర్ 19 ప్రభాతవార్త



ఆనిమేటర్లకు శిక్షణనిస్తున్న దృశ్యం

బెలుగుప్ప మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర పైన పరిశుభ్రత పచ్చదనం పైన 19 పంచాయతీల మహిళా సంఘ సభ్యుల కు 40 గ్రామాల యానిమేటర్లకు అవ గాహన శిక్షణ సమావేశం నిర్వహించా రు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కన్వీనర్ మల్లికార్జున పాల్గొని మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు పరిశుభ్రత పాటించాలని అలాగే చెట్ల పంపకాన్ని చేపట్టాలని, ప్రతి ఇంటి చుట్టుపక్కల పరిసరాలలోనూ రోడ్లలోనూ చెత్త చెదారం ఉండకూడదని ప్లాస్టిక్ వాడకాన్ని కచ్చితంగా నిషేధించాలని గ్రీన్ అంబాసిడర్లు ప్రతి గ్రామంలోనూ పని చేయాలని వారు తెచ్చే చెత్తబుట్టలోనే చెత్త వెయ్యాలని తడి చెత్త పొడి చెత్త సపరేట్గా వేయాలని, ప్రతి గ్రామంలోనూ రోడ్లలోనూ ప్రతి అన్ని కాలనీలలోను బ్లీచింగ్ పౌడర్ను చల్లుతున్నారా లేదా అని మహిళా సంఘ సభ్యులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో మండల ఎంపీడీవో సార్ లక్ష్మీనారాయణ, ఏపీఎం సురేఖ, డిఆర్పిలు.. సీసీలో రాంప్రభూ, మంజునాథ, శివప్రసాద్, నారాయణప్ప, మండల సమాఖ్య లీడర్లు, భాగ్యమ్మ, శ్రీవాణి 19 పంచాయితీల గ్రామ సంఘం లీడర్లు యానిమేటర్లు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మార్కెట్ యార్డు చైర్మన్ లక్ష్మీదేవిరమేష్

### నియోజకవర్గంలోని 46,680 మంది రైతులకు 35.05 కోట్లు అన్నదాతల ఖాతాల్లోకి జమ



అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కె.వి.కె ప్రధాన శాస్త్రవేత్త చెంద్రాయుడు

కళ్యాణదుర్గం,నవంబర్ 19 ప్రభాతవార్త :



రూ. 35.05 కోట్ల చెక్కు విడుదల చేస్తున్న దృశ్యం

రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీగా ఇచ్చిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాల లో భాగంగా రెండవ విడత నిధులను బుధ వారం విడుదల చేశారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో బుధవారం స్థానిక శ్రీమతి లక్ష్మీదేవి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు అధ్యక్షతన రైతుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 46,680 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద మంజూరైన రూ. 35.05 కోట్ల రూపాయల చెక్కును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున ప్రస్తుత మార్కెట్ కమిటీ చైర్మన్ బోయ లక్ష్మీదేవి రమేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సర్భంద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరుచేశారని అన్నారు. రైతుల సంక్షేమంకోసం రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేకచొరవతో కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46,85,838మంది రైతులకు 6310కోట్లరూపాయలు లబ్ది చేకూరనుండగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 46,680 మంది రైతులకు 35.05 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లోకి జమ చేయడం హర్షనీయమన్నారు. గత ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం వహించిందని రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని అన్నారు. అందుకే ఎన్నికల సమయంలో రైతు కష్టాలను కళ్లారా చూసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని కేంద్రం సహాయంతో ప్రవేశపెట్టాలని అన్నారు. అంతేకాకుండా స్థానిక ఎమ్మెల్యే సురేంద్రబాబు అకుంఠిత దీక్ష దక్షతతో బీటీపి కుందుర్పి బ్రాంచ్ తెనాలి ద్వారా 114 చెరువులకు సాగునీరు అందించే బృహత్ పథకానికి పనులు వేగంగా నిర్వహిస్తున్నారని అన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పిలిస్తేపలికే కరువుకు శాశ్విత పరిష్కారంగా చెరువులకు నీరు అందించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సురేంద్రబాబు ఎన్నికల హామీలో భాగంగా అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాపం పల్లి రామాంజనేయులు, కుందుర్పి మండల కన్వీనర్ ధనుంజయ, వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోటి దీపోత్సవం కార్యక్రమం జయప్రదం చేయండి

డి.హిరెహళ్ నవంబరు 19 ప్రభాతవార్త



శ్రీ శివలింగరూడా స్వామి

కార్తీక మాసం అమావాస్య ను పురస్కరించుకొని గురువా రం శ్రీ శివలింగరుడాస్వామి మఠం లో నిర్వహించనున్న కార్తీక కోటి దీపోత్సవ కార్యక్ర మంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని మఠం కమిటీ సభ్యులు, రాష్ట్ర ఆర్యవైశ్యులు కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్ళి రాజు తెలిపా రు. బుధవారం డి.హిరెహళ్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్తీక అమావాస్య సందర్భంగా శ్రీ శివలింగరూడాస్వామి మఠంలో జరప చేపట్టిన దీపోత్సవ కార్యక్రమం కు ఆయన భక్తులను ఆహ్వానించారు. కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు సాయంకాలం ఆరు గంటలకు శ్రీ శివలింగరుడా స్వామి మఠంకు నూనె వత్తులతో చేరుకొని కార్యక్రమమును జయప్రదం చేయాలని ఆయన భక్తులకు విజ్ఞప్తి చేశారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి - డాక్టర్ మహేంద్ర

కనేకల్లు నవంబర్ 19 ప్రభాతవార్త



అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని మన ఆరోగ్యం కాపాడ డం మన చేతిలోనే ఉందని డాక్టర్ మహేంద్ర రోగులకు సూచించారు. ప్రపంచ ఏఎమ్ఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగం గా బుధవారం సామాజిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యులు మహేంద్ర నిరీష ప్రజలకు వ్యాధుల ప్రబలకుండా ఉండడానికి తీసుకోవాల్సిన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మహేంద్ర మాట్లాడుతూ సూక్ష్మజీవులు( బ్యాక్టీరియా, వైరస్ మరియు ఫంగస్) వంటి వాటి వలన వ్యాధులు వేగంగా ప్రబలడానికి కారణాలవుతాయి. కావున ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని భోజనం చేసే ముందు భోజనం చేసిన తర్వాత చేతులను శుభ్రంగా కడుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

## కొత్త ఇళ్ల నిర్మాణానికి జియో ట్యాగ్ తప్పనిసరి

అగళి, నవంబర్ 19 ప్రభాతవార్త



జియోట్యాగ్ చేస్తున్న దృశ్యం

కొత్తగా ఇల్లు మంజూరు అయిన వారికి తప్పనిసరిగా జియో ట్యాగ్ చేయించుకోవాలని వర్క్ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వా లు ఇళ్లను మంజూరు చేశాయి. ఇళ్ల కోసం ఆన్లైన్ చేసుకున్న లబ్దిదారులు వారివారి ఇళ్ల నిర్మించుకునే స్థలం వద్దకు వెళ్లి నాయకులతో కలిపి జియో ట్యాగ్ వేశారు. ఆలూడి, ముత్తేపల్లి తదితర గ్రామాల్లో సిబ్బందితో కలిసి జియో ట్యాగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నరసింహరాజు, గురునాథ్, తిప్పేస్వామి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

బెలుగుప్ప, నవంబర్ 19 ప్రభాతవార్త



రైతులకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీల మేరకు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాలలలో భాగంగా రెండవ విడుత నిధులను బుధవారం పంచా యితీ కార్యాలయం న వా వే శం లో చెక్కులను అందజేశారు. ఆర్థిక శాఖమంత్రి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు.. తెలుగుదేశం జిల్లా కార్యదర్శి మల్లికార్జున, తహశీల్దారు అనిల్కుమార్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బెలుగుప్ప మండలంలో 8,051 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కింద మంజూరైన రూ.5.61 కోట్లు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సాలీబాయి, వెంకటనాయుడు, మాజీ వైస్ ఎంపిపి తిమ్మప్ప, కెంచరాముడు అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ..సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల ఖాతాలోకి జమా చేశారని రైతులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం వహించిందని, రైతుల్లో ఎన్నో కష్టాలు చూసిన సీఎం, మంత్రి పయ్యావుల కేశవ్ అన్నదాత సుఖీభవ పథకాన్ని కేంద్రం ప్రభుత్వం సహాయంతో ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పడటం వల్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పృథ్యుసాగర్, మండల పరిషత్ అధికారి లక్ష్మీనారాయణ, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అని రంగాల్లో రాణించాలి

### గ్రంథాలయ అధికారి మల్లికార్జున

కనేకల్లు నంబర్ 19 ప్రభాతవార్త



మహిళా దినోత్సవ సంబరాలు జరుపుకుంటున్న గ్రంథాల సిబ్బంది

మాజీ ప్రధాని ఇందిరా గాంధీనీ మహిళ లు ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందు కు సాగాలని గ్రంథా లయ అధికారి మల్లి కార్జున విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయం కణేకల్ నందు బుధవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మహిళదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక జెడ్.పి. హెచ్ బాలికలపాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున రావు ఎలిమెంట్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగనాథ్ ఉపాధ్యాయయులు సూర్యకాంతం రెడ్డి ఇనాయతుల్ల రమేష్ శ్రీమతి వాని వసుందర పాల్గొన్నారు. ముందుగా మనదేశ మహిళా ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు .అనంతరం మల్లికార్జున రావు మాట్లాడుతూ మన దేశ మొట్టమొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ అని, ఆమెకు మదర్ ఇందిరా అలాగే ఐరన్ లేడీ అనే భీరుదుల ద్వారా ఖ్యాతి గాడించింది అని అన్నారు, ఆమె దేశానికీ చేసిన సేవలు గుర్తుంచుకోవాల్సినవని తెలియజేసారు. అలాగే రంగనాథ శర్మ మాట్లాడుతూ ఇందిరాగాంధీ అత్యధిక కాలము మహిళా ప్రధానమం త్రిగా పనిచేసారని, ఆమె ఎందరో మహిళలకు ఆదర్శం అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయధికారి డి.మల్లికార్జున ఓబులేశు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## ఇడ్లీ తయారీలో ప్లాస్టిక్ వాడకం.. ఆరోగ్యంపై ముప్పు

కంబదూరు, నవంబర్ 19, ప్రభాతవార్త



అల్పాహార ఆహార పదార్థాల లో ఇడ్లీ మొదటి స్థానంలో ఉందని చెప్పవచ్చు. మనిషి ఎవరైనా అనారోగ్య బారిన పడితే తప్పకుండా ఇడ్లీ తినాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే హోటల్ యాజమాన్యా ల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుత రోజుల్లో ఇడ్లీ తయారీ కలుషితంగా మారిందని ప్రజలు చెబుతు న్నారు.కంబదూరు మండల కేంద్రంలోని పలు హోటల్లలో ఇడ్లీ తయారీలో ప్లాస్టిక్ పదార్థాల వాడకం విస్తరిస్తోంది. ఇడ్లీ పిండిని నిల్వ చేయడానికి, ఆవిరి పెట్టే సమయంలో ప్లాస్టిక్ కవర్లు ,షీట్లు వాడుతున్న సంఘటనలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేడి తాకే సమయంలో ప్లాస్టిక్ నుంచి బయటపడే రసాయనాలు ఆహారంలో కలిసిపో తున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.100 డిగ్రీల వరకు వేడి అయ్యే ఆవిరివంటలో సాధారణ ప్లాస్టిక్ పూర్తిగా కరగడంతో అలా తయారైన ఆహారాన్ని తీసుకోవడం క్యాన్సర్, హార్మోన్ అసమతుల్యత, కిడ్నీ,లివర్ దెబ్బతినే ప్రమాదం వంటి తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందని వైద్యులు అంటున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, వైద్యాధికారులు నామమాత్రపు తనిఖీలు చేయడం వల్ల హోటల్ నిర్వహణ యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఇడ్లీ ప్రియులు చర్చించుకుంటున్నారు. ఇదే విషయంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా అప్రమత్తం చేశారు. వేడి ఆహారానికి ప్లాస్టిక్ వాడకూడదని కఠినంగా నిబంధనలు ఉన్నప్పటికీ, పలు హోటళ్లు, చిన్నచిన్న బ్రేక్ఫాస్ట్ కేంద్రాలు మాత్రం ఇంకా ప్లాస్టిక్ కవర్లను వాడుతూనే ఉన్నాయని తెలుస్తోంది.ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్లాస్టిక్ వాడకంపై ప్రభుత్వ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఇడ్లీ తయారీలో కాటన్ బట్టను ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## వైద్య విద్య ప్రైవేటీకరణ దారుణం



సంతకాలను సేకరిస్తున్న దృశ్యం

గుత్తి, నవంబర్ 19 ప్రభాతవార్త

ప్రజానీకానికి ఉచితంగా వైద్య సేవలు అందించే వ్యవహారంలో కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తోందని వైకాపా జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ వన్నూర్బీ, ఎంపిపి విశాలాక్షి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి సివి రంగారెడ్డి, తదితరులు ఆరోపించారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా వాటిని ప్రభుత్వం పిపి పద్ధతిన ప్రైవేటుపరం చేస్తోందని విమర్శించారు. ఈ శిబిరానికి అనూహ్య స్పందన కాన వచ్చింది. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు మధుసూదన్రెడ్డి, గంగరాజు, మాజీ కన్వీనర్లు హుస్సేన్పీరా, గోవర్ధన్రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ మైనుద్దీన్, కౌన్సిలర్లు, జిల్లా నాయకులు, పాల్గొన్నారు.

## ఎదురుకాల్పుల పేరిట బూటకపు ఎన్కౌంటర్లు సరికాదు

గుంతకల్లు, నవంబర్ 19 ప్రభాతవార్త

ఎదురు కాల్పుల పేరిట బూటకపు ఎన్కౌంటర్లు సరికాదని సిపిఐ ఎంఎల్ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ అన్నారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు హిడ్మా ఎన్కౌంటర్ను ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ప్రాంతంలో హిడ్మాను పోలీసులు చిత్రహింసలకు గురిచేసి ఎన్కౌంటర్ చేశారని ఆరోపించారు. మరి కొంతమంది మావోయిస్టులు కూడా పోలీసుల అదుపులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టులకు ప్రాణహాని తలపెట్టకుండా ప్రభుత్వం బహిరంగ ప్రకటన చేసి ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. హిడ్మా ఎన్కౌంటర్ను సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా న్యాయ విచారణ జరిపి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఆయన కోరారు.

## అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ రెండవ విడత నిధుల విడుదల

చిలమత్తూరు, నవంబర్ 19 ప్రభాతవార్త



చెక్కును అందచేస్తున్న దృశ్యం

అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ రెండవ విడత నిధుల విడు దల కార్యక్రమం బుధవారం చిలమ త్తూరులోని వ్యవసా య కార్యాలయంలో బుధవారం జరిగిన ది. ఈ కార్యక్రమా నికి నియోజకవర్గం లోని రైతులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలో 21,287 మంది రైతులకు సంబంధించి 14.68 కోట్ల రూపాయలు వారి ఖాతాలలో జమ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులు వారి శాఖల్లో అమలవుతున్న కార్యక్ర మాలను రైతులకు వివరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే బాలకృష్ణ పిఏలు వీరయ్య, శ్రీనివాస్, బాలాజీ మాట్లాడుతూ రైతులకు సంబంధించిన ప్రభుత్వం చేపడుతున్నటువంటి పథకాలను అదేవిధంగా రైతులకు కావాల్సిన సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం ఎల్లవేళల సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అనంతరం సింగిల్ విండో అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందించే పథకాలు రైతులకు చేరేటట్లు అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడి కృష్ణయ్య, హార్టికల్చర్ అధికారి మహేష్, సిరికల్చర్ అధికారి రాజు, చిలమత్తూరు, హిందూపురం, లేపాక్షి మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

### - గోరంట్లలో గ్రంథాలయ వారోత్సవాలు

గోరంట్ల, నవంబర్ 19 ప్రభాతవార్త



గ్రంథాలయంలో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

స్థానిక గోరంట్ల శాఖ గ్రంథాలయం లో 58వ జాతీయ గ్రంథాలయ వారో త్సవాల్లో భాగంగా బుధవారం ఇంది రాగాంధీ జయంతి, మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికా రి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి విచ్చేసి ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న వీరవనితలు ఝాన్సీలక్ష్మీబాయి, సరోజినీనాయుడు గురించి విద్యార్థులకు విపులంగా తెలియజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ నేటి మహిళలు బాగా చదువుకొని మునుముందు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులు శ్రీరాములు, కార్యదర్శి శ్రీనివాస్గుప్తా, సంయుక్త కార్యదర్శి రమేష్బాబు, కార్యవర్గ సభ్యులు నరహరిమూర్తి, వెంకటరమణ, ఉపాధ్యాయులు ప్రతిభ, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### - తహాశీల్దార్ రమాదేవి

గుంతకల్లు, నవంబర్ 19 ప్రభాతవార్త



తహశీల్దార్ రమాదేవిని సన్మానిస్తున్న దృశ్యం

మహిళలు అన్ని రంగా ల్లో రాణించాలని తహశీ ల్దార్ రమాదేవి అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిం చిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశ తొలి మహిళా ప్రధానిగా ప్రపంచంలోనే శక్తివంతమైన మహిళగా కీర్తి గడించారని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు పురుషులతో సమానంగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారిని కే.సుజాత తహశీల్దార్ను శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ ఆదిలక్ష్మి, హేమలత పాల్గొన్నారు.

## టిడిపి నేత మాజీ ఎంపిటిసి మృతి

గుత్తి, నవంబర్ 19 ప్రభాతవార్త



నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని సూరసింగనపల్లి కాలనీలో నివాసముండే సీనియర్ టిడిపి నాయకుడు, మాజీ ఎంపిటిసి పెద్దన్న బుధవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారో గ్యంతో ఆయన బాధపడేవా రు. ఆయన మృతి పట్ల టిడిపి జిల్లా అధ్యక్షుడు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, గుత్తి టిడిపి ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, మార్కెట్యార్డుచైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్చౌదరి, ఆసుపత్రి కమిటీ సభ్యులు చికెన్ శీన, మాజీ మార్కెట్యార్డుచైర్మన్ శ్రీనివాసయాదవ్, తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా పలువురు టిడిపి నాయకులు ఆయన మృతి పట్ల తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## పేద విద్యార్థినీలకు సైకిళ్లు పంపిణీ

గుంతకల్లు, నవంబర్ 19 ప్రభాతవార్త



విద్యార్థినీలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

స్టేట్బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వ ర్యంలో బుధవారం పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ బాలుర ఉన్నత పాఠశాలలో 10 మంది పేద విద్యార్థినీలకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా రీజినల్ మేనేజర్ కే.రమేష్బాబు మాట్లాడుతూ (సిఎస్ఆర్) కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ప్రతి ఏడాది పలువురు పేద వారికి సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గుంతకల్లులో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసులు, స్టేట్బ్యాంకు చీఫ్ మేనేజర్ కే.సురేష్కుమార్, మేనేజర్ సందీప్, హెచ్ఆర్ సురేంద్ర, అసోసియేట్ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ 2వవిడత చెక్కుల పంపిణీ

## ధర్మవరం నియోజకవర్గంలో 39వేల మంది రైతులకు రూ.26.50 కోట్ల లబ్ది - ఎంపీ, మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడి - యువత వ్యవసాయం వైపు అడుగులు వేయాలి - త్వరలోనే హెచ్చెల్సీహంద్రీనీవాను అనుసంధానం చేస్తాం


కూటమి నేతలను గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు


చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీ పార్థ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూటమి నాయకులు

ధర్మవరం రూరల్ నవంబర్ 19 ప్రభాతవార్త

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ 2వవిడత చెక్కుల పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర కుటుంబ ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపీ పార్థసారథి, తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ రెండో విడత నిధులు పంపిణీ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్, హిందూపురం ఎంపీ పార్థసారథి, తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్,జనసేన ఇన్ ఛార్జి చిలకం మధుసూదన్ రెడ్డి, రైతులు, అధికారులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులను, నాయకులను గజ మాలతో సత్కరించారు. అన్నదాత సుఖీభవ మెగా చెక్కును రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. .గత ప్రభుత్వంలో అన్ని వర్గాల వారు ఎంతో ఇబ్బంది పడ్డారని.. అలాంటి కష్టాల నుంచి సూపర్ సిక్స్ అనే ఒక బలమైన అస్త్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చా రన్నారు. దీనిపై ప్రజలు కూడా నమ్మి కనీవినీ ఎరుగని రీతిలో మనకు విజ యాన్నందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొద టి రోజు నుంచే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం మొదలుపె ట్టింద న్నారు. ఇందులో భాగంగా పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ కింద మొదటి విడత ఒక్కో రైతుకు 7వేల రూపాయలు అందించినట్లు చెప్పారు. ఇప్పుడు రెండో విడత కింద మరో 7వేల రూపాయలు అందుతుందన్నారు. దీనివలన రైతులు జీవితాలు బాగు పడతాయని తాము చెప్పడం లేదని.. కానీ రైతులకు ఎంతో కొంత సాయంగా ఇది ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రపం చంలో ఎక్కడా లేనివిధంగా భారత దేశంలో వ్యవసాయ భూమి ఎక్కువగా ఉందన్నారు. కానీ ఇటీవల చాలామం ది రైతులు వ్యవసాయంలో గిట్టుబాటు ధరలురాక , పంటలు పండక.. సాగుకు దూరమవు తున్నార న్నారు. తమ భూములను ఏవైనా పరిశ్రమలకు ఇచ్చేద్దామా అన్న ఆలోచన ఎక్కు వగా ఉందన్నారు. మనకి పరిశ్ర మలు, ఐటి ఉద్యోగాలు వంటివి ఎంత ముఖ్యమో వ్యవసాయం కూడా అంతకంటే ముఖ్య మన్నారు. ముఖ్యంగా యువత వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని శ్రీరామ్ పిలుపునిచ్చారు. మంత్రి సత్య కుమార్ సహకారంతో ధర్మవరం నియోజకవర్గంలో చాలా ప్రాంతాలకు సాగునీరు అందుతోందన్నారు. ప్రస్తుతం హెచ్చెల్సీ నీరు తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవ రం రూరల్ మండ లాలకు అందడం లేదన్నారు. మంత్రి సత్య కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సహ కారంతో హంద్రీనీవా, హెచ్ఎల్సీ కాలువలు అనుసం ధానం చేసి చెరువుల నింపాలన్నారు. ప్రస్తుత సమా జంలో గొర్రెల పెంపకంపై మక్కువ చూపుతు న్నారన్నారు. ఎంపీ నిధులతో రజకులకు దోబీ ఘాట్ నిర్మాణం చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాము నాయక్,వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్, వ్యవసాయ అధికారి ముస్తఫా, మాజీ జెడ్పి చైర్మన్ ఓబిరెడ్డి, ఏపీ సీడ్స్ డైరెక్టర్ కాటమయ్య, మార్కె ట్ యార్డ్ చైర్మన్ అరుణ శ్రీ, సింగల్ విండో అధ్యక్షులు మేక ల రామాం జనేయులు, నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి, బిజెపి నాయకుడు చంద్ర, కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ; ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు


ఎమ్మెల్యే కాలువను సన్మానిస్తున్న నాయకులు

కనేకల్లు నవంబర్ 19 ప్రభాతవార్త

రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలబడిందని రాయదుర్గం శాసనసభ్యులు ప్రభుత్వ విప్పు కాల్వ శ్రీనివాసులు అన్నారు. అన్నదాత సుఖీభవ రెండో విడతలో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ నందు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రభుత్వ విప్పు స్థానిక ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం కూటమి ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసిందన్నారు. మాట ఇచ్చిన ప్రకారం ప్రతి హామీను నెరవేర్చుతూ రాష్ట్ర ప్రజలకు ఎండి ఎక్కువటమే మరింత చేరువయ్యింది అన్నారు. ఎంత కష్టతరమైన తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఒక బృహత్తర కార్యమ న్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఈ కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నీరుగా వాళ్ళ ఖాతాలోకి అన్నదాత సుఖీభవ డబ్బు జమవుతుంది అన్నారు. ముందుగా టపాసాలు కాలుస్తూ ఘనంగా ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులకి స్వాగతం పలికారు. అనంతరం నాయకులు సెలవా కప్పి గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో కన్వీనర్ వన్నారెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ హను మంత రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ ఆనం ద్ రాజు పక్రుద్దీన్ సాబ్ సుదర్శ న్ మార్కెట్ యార్డ్ మెం బర్ చాంద్ బాషా చెరువు సం ఘం అధ్యక్షులు రమేష్ బాబు ఆదర్శ భారతి బ్యాంకు అధ్యక్షులు చం ద్రశేఖర్ గుప్తా లాలెప్ప ఎస్ కే మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు

# ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం.

## అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు నియోజకవర్గంలో 29 కోట్ల 95 లక్షల రూపాయలు 44,348 రైతుల ఖాతాల్లో జమ వర్చువల్ విధానంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు


29 కోట్ల 95 లక్షల రూపాయలు చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే టిడిపి నాయకులు దృశ్యం.


ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి కి కిసాన్ డ్రోన్‌ను అందజేస్తున్న జై కిసాన్ గ్రూప్ సభ్యులు.

కొత్తచెరువు నవంబర్ 19 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 15 నెలల లోనే ప్రజాపాలన తో పాటు రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలం చినదాసరిపల్లి గ్రామంలో రెండో విడత అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ రెండో విడత నిధులు విడు దల కార్యక్రమంను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు కొత్తచెరువు మండల పరిధిలో పో తల కుంట రైతు సేవా కేంద్రం నందు వర్చువల్ విధానంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ను ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి , మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గం కింద మొ త్తం 44 వేల 348 మంది రైతులకు 29 కోట్ల 95 లక్షల రూపాయలు రెండో విడత అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కింద వారి ఖాతాల్లో నిధులు జామ చేయబడును ఈ డబ్బులను రైతులు పంట పెట్టుబ డికి వినియోగించుకోవాలని రైతులకు సూచించారు జై కిసాన్ గ్రూపుకు చెందిన కిసా డ్రోన్‌ను ఎమ్మెల్యే చేతుల మీద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవ సాయ శాఖ అధికారి సతీష్‌బాబు, సునీత టిడిపి సీనియర్ నా యకులు సాలక్ గారి శ్రీనివాసులు, మండల కన్వీనర్‌లు ఒలిపి శ్రీనివాసులు, రామ కృష్ణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు నాగేంద్రప్రసాద్, సింగిల్ విండో ప్రెసిడెంట్ లు హరిప్రసాద్ జయప్ప ,మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి , తలారి లింగప్ప, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీనాథ్, ఈశ్వర్ రెడ్డి రైతు సేవ సిబ్బంది ప్రతాపరెడ్డి బషీర్ బూత్ కన్వీనర్ శ్రీనివాసులు వెంకట్ నారాయణ , నారాయణస్వామి మహేష్ తదితరులు పాల్గొన్నారు

# పుట్టపర్తి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి కృతజ్ఞతలు

శ్రీ సత్యసాయి జిల్లా (వైద్యము) నవంబర్ 19 ప్రభాతవార్త:

పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి సాస్కీ పథకం నుంచి రూ.35 కోట్ల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఆ నియోజకవర్గ శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి , మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రహదారి పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. శ్రీ సత్యసాయిబాబా వారి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన పవన్ కళ్యాణ్‌తో బుధవారం మధ్యాహ్నం ఇరువురు నేతలు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని అమడుగూరు, బు క్కపట్నం, కొత్త చెరువు, నల్లమాడ, ఓబుల దేవర చెరువు తదితర ప్రాంతాల నుంచి పుట్టపర్తికి చేరే రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

# పుట్టపర్తి సాయిబాబా 100వ జయంతి వేడుకలకు హాజరైన ప్రధాన మంత్రి నరేంద్ర మోడిని కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఎంపీలు, ఎంఎల్‌ఏలు తదితర నాయకులు అధికారుల దృశ్య మాలిక











# రైతన్నకి వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం

## - వైసీపీ హయాంలో మైనార్టీలను విస్మరించారు - వచ్చే రోజుల్లో వైసిపికి 11 సీట్లు లేకుండా ప్రజలు బుద్ధి చెబుతారు - అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ రెండవ విడత పంపిణీలో - ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్


రైతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, నవంబర్ 19 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం రైతన్నకి వెన్నుదన్నుగా నిలుస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. బుదవారం కదిరి పట్టణం హిందూ పూర్ రోడ్డు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం కింద రెండవ విడత సాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ హామీలలో భాగంగా ఈ ఏడాది ఆగస్టున తొలి విడత సాయం కింద 3వేలు కోట్లు రైతులకు అందించామని నేడు రెండో విడత కింద రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 2వేలు కోట్లు రైతుల ఖాతాలలో జమ చేశామన్నారు. అదే విధంగా అన్నదాత సుఖీభవ పథకం కింద కదిరి నియోజకవర్గంలోని రైతులకు 30.18లక్షలు లబ్ది చేకూరిందని చెప్పారు. వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ప్రభుత్వం ఏర్పడిన 18 నెలలు కాలంలో సూపర్ సిక్స్ హామీలు అమలు చేశామో లేదో పిల్లల నుండి పెద్దల వరకూ వెళ్లి అడగాలని జగన్‌కి హితవు పలికారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మైనార్టీలకు అండగా నిలబడిందని అందులో భాగంగా మౌజాన్లకి గౌరవ వేతనం కింద 90 కోట్లు విడుదల చేశామని ఈ ఘనత కూటమి ప్రభుత్వం కే దక్కుతుం దన్నారు. విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేసి పిల్లల గౌరవం పెంచేలా యూనిఫాంతో పాటు షూస్ అందజేశా మన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వంలో మైనార్టీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. కదిరి నియోజకవర్గంలో గుంతల మయమైన రోడ్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బాగు చేశాం. గతంలో ఇచ్చిన హామీ మేరకు మూడు నెలల వ్యవధిలో కదిరి రాయచోటి రోడ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. అలాగే కదిరి పట్టణంలో అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు వేస్తున్న వారి పట్ల కటినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. స్వలాభం కోసం వేసిన లేఔట్‌లలో ప్లాట్లను విక్రయించొద్దని ప్రజలకు సూచించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ లేఅవుట్లు ద్వారా ప్రజల సొమ్మును కొల్లగొడుతూ సొమ్ము చేసుకుంటున్నారని, రాబోయే కాల ంలో ఆ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలంటే రోడ్డులకి 20 అడు గులు లేని పరిస్థితి ఏర్పడుతోందని, గతంలో వైసిపి ప్రభు త్వంలో చంద్ర బాబునాయుడుపైన గతంలో గులక రాయి విసిరారు. దీనిని అప్పట్లో వైసీపీ అధినేత జగన్ సమర్థించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయా ంలో అధికారాన్ని అడ్డు పెట్టుకొని గన్నవరంలో టీడీపీ కార్యాల యాన్ని ధ్వంసం చేశారని ఇలాంటి ఆటవిక పాలనకు ప్రజలు గట్టిబుద్ధి చెప్పి గత ఎన్నికల్లో వైసిపికి 11 సీట్లు ఇచ్చారని అయినా వైసీపీలో పశ్చాతాపం కనిపించక పోగా, ప్రస్తుతం మళ్లీ రఫా రఫ్ అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని వైసీపీ ఇలాంటి పద్ధతులు మానుకోకపోతే భవిష్యత్తులో ప్రస్తు తం ఉన్న 11 సీట్లు లేకుండా ప్రజలు గట్టి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా బాహుద్దీన్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్.పార్థసారథి, వ్యవ సాయ శాఖ ఏడిఎ సనావుల్లా, వ్యవసాయ అధికారి శ్రీహరినాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మున్సి పల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# బటన్లు నొక్కి రైతులను మోసం చేసే ప్రభుత్వం కాదు ఈ ప్రభుత్వం

## - అన్నదాత సుఖీభవ 2వ విడత చెక్కుల పంపిణీలో పరిటాల సునీత - రాప్తాడు నియోజకవర్గంలో 51,487మంది రైతులకు రూ.35.98 కోట్ల లబ్ది - రైతులకు ఉలవలు పంపిణీ, రైతులతో ముఖాముఖి - గోరుచిక్కుడు, వేరుశనగ, చీనీ పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే - మనకు జరిగిన మంచిని పదిమందికి చెప్పాలన్న పరిటాల సునీత


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, నవంబర్ 19 ప్రభాతవార్త

వైసిపి ప్రభుత్వం లాగా ఓ వైపు బటన్లు నొక్కి.. ఇంకోవైపు రైతులను మోసం చేసే ప్రభుత్వం కాదని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. బుధవారం చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి గ్రామంలో అన్న దాత సుఖీభవ, పిఎం కిసాన్ 2వ విడత నిధులు విడుదల కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్ర మానికి ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు రైతులు, నాయకులు అంతా ఆకుపచ్చ కండువాలు ధరించి పాల్గొ న్నారు. ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి నవధాన్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంత రం రైతులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రైతు నాగిరెడ్డి మాట్లాడుతూ.. నాలుగు రోజుల్లో చెరువుకు నీరు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే చెరువు నిండటం వలన పొలాలకు వెళ్లే దారుల్లో ఇబ్బందులు కలుగుతు న్నాయని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకెళ్లారు, దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ, కల్వర్టులు నిర్మిస్తామని ఎమ్మెల్యే సునీత హామీ ఇచ్చారు. అనంతరం ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులకు సబ్సిడీపై ఉలవలు అందజేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఇటీవల ప్రధాని చేతుల మీదుగా సత్కారం అందుకున్న బత్తలపల్లి మండలం రాఘవపల్లికి చెందిన గంగమ్మకు అనే మహిళా రైతును ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత పొలం పిలుస్తోంది కార్యక్ర మంలో భాగంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అక్కడే గోరుచిక్కుడు, వేరుశనగ, చీనీ వంటి పంటలను ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. ప్రస్తుతం పంటల పరిస్థితి ఎలా ఉందని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఈరోజు రైతుల కళ్ళల్లో ఆనందం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇటీవల 7వేల రూపాయలు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద అందించామని.. ఇప్పుడు మరోసారి 7వేలు అందుతుండటంపై రైతులు ఎంతో సంతో షంగా ఉన్నారన్నారు. అలాగే నియోజకవర్గంలో డ్రిప్పు, స్ప్రింక్లర్లు, ట్రాక్టర్లు కావా లని వ్యవసాయ శాఖ మంత్రిని అడిగామని.. త్వరలోనే వాటిని అందిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్ల నియోజ కవర్గంలో చాలా ప్రాంతాల్లోని చెరువులకు నీరు అందాయని భూగర్భ జలాలు కూడా గణనీ యంగా పెరిగినట్లు తెలిపారు. రీ సర్వే చేసి అందరికీ పథకం వర్తించేలా చూస్తామని ఎమ్మెల్యే సునీత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, హిందూపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు దండు ఓబులేసు, పార్టీ సీనియర్ నాయకులు రైతులు ప్రజలు పాల్గొన్నారు.

# నేడు పుట్టపర్తి రానున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ


కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

పుట్టపర్తి (కలెక్టరేట్), నవంబర్ 19, ప్రభాతవార్త

భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలలో పాలుపంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారులు, రవాణ శాఖల మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పుట్టపర్తి చేరుకోనున్నట్లు అధికార వర్గాలు ఒక ప్రకటనలో తెలియజేశాయి. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఉదయం 07:00 గంటలకు నాగ్‌పూర్ విమానాశ్రయం నుండి బయలుదేరి ఉదయం 08:30 గంటలకు శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకోనున్నారు. అక్కడి నుండి 09:00 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకొని అక్కడ నిర్వహజంచి 11వ ప్రపంచ మహాసభల్లో "ప్రపంచ శాంతికి మార్గాలు" అనే కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం శాంతి భవన్ అతిథి గృహంలో 10:30 గంటలకు రహదారుల నిర్మాణంపై జాతీయ రహదారుల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. 11:30 గంటలకు అక్కడి నుండి బయలుదేరి శ్రీసత్య సాయి విమానాశ్రయం చేరుకొని 11:45 గంటలకు తిరుగు ప్రయాణం కానున్నట్లు అధికారులు తెలియజేశారు. అలాగే రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బి) మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్‌లు బుధ వారం రాత్రే పుట్టపర్తి చేరుకోగా, గురువారం జరిగే భగవాన్ సత్యసాయి బాబా శతజ యంతి ఉత్సవాలలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో కలిసి పాలు పంచుకోనున్నట్లు అధికారులు తెలియజేశారు.

# ఓబుళాపురంలో చీనీ చెట్ల నరికివేత

## : రివాజుగా మారిన పంటల నాశనం


నరికేసిన చీనీ చెట్లను పరిశీలిస్తున్న సీఐ ఈరన్న


నరికిన చెట్లను పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

యాడికి(తాడిపత్రి),నవంబరు19, ప్రభాతవార్తః

యాడికి మండలం ఓబుళాపురంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు 70 చీనీ చెట్లను నరికివేశారు. ప్యాపిలి మండలం గుట్లపల్లికి చెందిన రంగస్వామి అనే రైతు ఇక్కడ 9 ఎకరాల భూమి కొనుగోలు చేసి నాలుగేళ్లుగా 1,140 చీనీ చెట్లను సాగు చేస్తున్నాడు. గత మూడు రోజుల కిందటే ఈ చెట్లను నరికేసినట్లు, తోట పక్కన రైతు వీటిని గమనించి సంబంధిత రైతుకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో బాధిత రైతు బుధవారం పొలంలోకి వచ్చి పరిశీలించి యాడికి పోలీసులకు మౌఖికంగా ఫిర్యాదు చేశాడు. స్థానికంగా బాధిత రైతుకు ఎవరితోనూ ఎలాంటి విభేదాలు లేవని, ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన వాడు కాదని, అయినా ఇలా ఎందుకు జరిగిందోనని స్థానికులు చర్చించుకుంటు న్నారు. సమాచారం అందుకున్న యాడికి సీఐ ఈరన్న నరికివేతకు గురైన చీనీచెట్లను పరిశీలిం చారు. అనంతరం అనంతపురం నుంచి వచ్చిన క్లూస్ టీమ్ కూడా తోటను పరిశీలి ంచారు. తాడిపత్రి నియోజకవర్గంలో రాజకీయ ప్రత్యర్థులను ఆర్థికంగా నష్టపర చడంలో భాగంగా పండ్లతోటలను నరికివేసే సంస్కృతి ఒకప్పుడు బలంగా ఉండేది. ప్రస్తుతం ఆ సంస్కృతి ఓబుళాపురం, కత్తిమా నుపల్లి ప్రాంతంలో మళ్లీ పురుడు పోసుకున్నట్లుంది. ఇటీవల కత్తిమా నుపల్లిలో నిమ్మచెట్లను నరికివేయడం, డ్రిప్పు పైపులకు నిప్పు పెట్టడం, ఆముదాల పం టను నాశనం చేయడం వంటి సంఘటనలు చోటు చేసుకో వడం గమనార్హం. సంఘు టనలు జరిగినప్పుడు పోలీసులు రావడం, వివరా లు నమోదు చేసుకోవడం, దర్యాప్తు గాలికి వదిలేయడం వంటి పరిస్థితుల్లో బాధితులు ఫిర్యాదు చేయడానికి కూడా ముందుకు రావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

# కన్నుల పండువలా కార్తీక దీపోత్సవం

## : విశిష్ట అతిథిగా హాజరైన విరజానంద స్వామి
## : భక్తుల్లో ఆధ్యాత్మికతను రెట్టింపు చేసిన స్వామీజీ ప్రసంగం


-సహస్ర దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న విరజానంద స్వామి


విరజానంద స్వామి ప్రసంగాన్ని వీనుల విందుగా వింటున్న భక్తులు


కాంతులీనుతున్న కార్తీక దీప మహోత్సవం


దీపోత్సవ కార్యక్రమానికి హాజరైన అశేష భక్తజనం

యాడికి(తాడిపత్రి), నవంబరు 19, ప్రభాతవార్తః యాడికి మండలం రాయలచెరువులో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఉత్సవ సమితి, గ్రామస్థుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్తీక మహా దీపోత్సవం కన్నుల పండువలా జరిగింది. కార్తీక మాస శివరాత్రిని పురస్కరించుకొని నిర్వహించిన దీపలక్ష్మీ ఆరాధన, సహస్ర దీపాలంకరణ, సహస్ర లింగార్చనసేవ వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన బ్రహ్మంగారి మఠం అచలానంద పీఠాధిపతి విరజానంద స్వామి చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం, ప్రవచనామృతం భక్తులను విశేషంగా కట్టిపడేసింది. కార్తీకం లాంటి మాసం కానీ, కృతయుగం కంటే గొప్ప యుగం కానీ లేవనేది పెద్దల మాట అని, కార్తీక మాస శోభ దీపావళితో ప్రారంభమవుతుందని, హిందువులకు 365 రోజులు పర్వదినాలేనని విరజానంద స్వామి భక్తులకు విశదీకరించారు. హిందూత్వం లేకపోతే భారతదేశానికే కాదు ప్రపంచానికే ఉనికి లేదని, భారత దేశం సంస్కారానికి కేంద్రంగా ఉండటమే దీనికి ప్రధాన కారణమని ఆయన బోధించారు. అయ్యప్ప మాలధారులకు మాల ధారణ విశిష్టత గురించి స్వామీజీ చక్కగా వివరించారు. అనంతరం మహిళలు తమ వెంట తెచ్చుకున్న కంచాల్లో ప్రమిదలను వెలిగించి చెన్నకేశవస్వామి ఆవరణమంతా కార్తీక శోభను విస్తరించారు. ఇక్కడి ఆధ్యాత్మిక ప్రసంగాలను, కార్తీక దీపోత్సవాలను తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.